
సాక్షి
విశాఖపట్నం

ఆదివారం । 26 । జనవరి । 2025





రైల్వే గుర్రాలకు రెక్కలొచ్చాయ్!

వాల్తేరు డివిజన్‌లో అశ్వాల అదృశ్యం వెనుక మిస్టరీ

- హార్స్ రైడింగ్ పేరుతో కొనుగోలు చేసిన 8 గుర్రాలు మాయం
- చనిపోయాయని కొందరు.. అమ్మేశారని మరికొందరు కాకి లెక్కలు
- గుర్రాల పేరుతో గుటకాయ స్వాహా చేసిన ప్రోటోకాల్ విభాగ ఉద్యోగి!



హార్స్ రైడింగ్ సేవలు ప్రారంభిస్తున్న డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి(ఫైల్)

సాక్షి, విశాఖపట్నం: అనగనగా వాల్తేరు రైల్వే డివిజన్‌లో ఓ సామంత 'రాజు'.. దేశ రైల్వే చరిత్రలోనే తొలిసారిగా గుర్రాల స్వారీ మొదలెడితే పేరొస్తుందని పెద్ద రాజుకు చెప్పారు. అసలే పబ్లిసిటీ అంటే ఇష్టం ఉన్న పెద్ద రాజు ఓకే చెప్పేశారు. గుర్రాలొచ్చేశాయి. స్వారీ మొదలెట్టేశారు. కట్ చేస్తే ఇప్పుడేమో అక్కడ గుర్రాలు కనిపించడం లేదు. పెద్ద రాజుకు దృష్టికి ఈ విషయం తీసుకెళ్లకుండా ఆ సామంతరాజు మొత్తం మేనేజ్ చేసేశారు. గుర్రాలు గురించి అడిగితే 'మా రైల్వే గుర్రాలకు రెక్కలు వచ్చాయేమో! నాకేమీ తెలియదు.. బహుశా ఎగిరి పోయి ఉండవచ్చు'అని తప్పించుకు తిరుగుతున్నారు. ఇక్కడ సామంతరాజు ప్రోటోకాల్ ఉద్యోగి. పెద్ద రాజు డివిజన్ బాస్.

ఇది కథ కాదు.. వాస్తవం. వాల్తేరు రైల్వే డివిజన్‌లో గుర్రాలకు రెక్కలొచ్చి మాయమైపోయాయి. భారతీయ రైల్వే చరిత్రలో తొలిసారిగా వాల్తేరు డివిజన్ పరిధిలో గుర్రపు స్వారీ ప్రారంభించారు. వాల్తేరులోని ఈస్ట్‌కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రైల్వే ఫుట్‌బాల్ స్టేడియంలో హార్స్ రైడింగ్‌ను రైల్వే ఉద్యోగులతో పాటు ఆసక్తి ఉన్న వారికి 2022 నవంబర్ 6 నుంచి ఈ సౌకర్యం అందుబాటులోకి తీసుకొచ్చారు. అప్పటి డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి ఈ సేవలను ప్రారంభించారు. వాస్తవానికి స్పోర్ట్స్ అసోసియేషన్ పేరుతో ప్రారంభించినా.. దీని వెనుక డివిజన్ పరిధిలోని ఓ ప్రోటోకాల్ ఉద్యోగి మొత్తం చక్రం తిప్పారు. అప్పటి ఉన్నతాధికారులను మభ్యపెట్టి, డివిజన్‌కు పేరొస్తుందంటూ మాయ మాటలు చెప్పి.. తన పబ్బం గడిపేసేందుకు ఈ వ్యవహారాన్ని నడిపారు. మొత్తం 8 గుర్రాలను కొనుగోలు చేశారు. సాధారణంగా ఒక్కో గుర్రం రూ.55 నుంచి రూ.60 వేలుకే మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. కానీ ఆ అధికారి మాత్రం ఏకంగా రూ.లక్షకు పైగా ఒక్కో గుర్రానికి వెచ్చించారు. ఇలా కొనుగోలులోనే గోల్‌మాల్ ప్రారంభించారు. అనంతరం వాటికి ఆహారం పేరుతో లక్షలాది రూపాయలు ఖర్చు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.



గుర్రం చనిపోయినా...

హార్స్ రైడింగ్ ప్రారంభించిన కొద్ది రోజులకే ఒక గుర్రం మృత్యువాత పడింది. ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా ఆ ప్రోటోకాల్ ఉద్యోగి జాగ్రత్తపడ్డారు. ఎవ్వరికీ తెలీకుండా కనీసం పోస్టుమార్టం చేయకుండా.. చనిపోయిన గుర్రాన్ని మాయం చేసేశారు. వారం రోజుల తర్వాత అప్పటి డీఆర్ఎం ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన సమయంలో 8 గుర్రాలకు బదులుగా 7 మాత్రమే ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే పాము కాటుకు గురై చనిపోయిందని చెప్పడంతో మెమో జారీ చేసినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత కొద్ది రోజుల పాటు రైడింగ్ సర్వీసును నిలిపేశారు.

మాయమైపోయిన అశ్వాలు

పాత డీఆర్ఎం మారిపోవడం, కొత్త అధికారి బాధ్యతలు స్వీకరించడం చకచకా జరిగిపోయాయి. ఈ క్రమంలోనే ప్రోటోకాల్ ఉద్యోగి తన హస్తలాఘవం ప్రదర్శించారు. మిగిలిన 7 గుర్రాలను అతను మాయం చేసినట్లు సమాచారం. ఓవైపు అశ్వాలకు ఆహారం పేరుతో నెలనెలా లక్షల రూపాయలు డివిజన్ సొమ్ము స్వాహా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఆ గుర్రాలను ఏం చేశారన్నదానిపై స్పష్టత లేదు. ప్రోటోకాల్ ఉద్యోగి మాత్రం ఏడాది తర్వాత.. ఆ గుర్రాలను విక్రయించేశామని చెబుతున్నారు. తక్కువ ధరకు అమ్ముడుపోయాయంటూ కొంత సొమ్ము జమ చేసినట్లు అధికారులకు తప్పుడు లెక్కలు చూపించినట్లు తెలిసింది. అయితే కొందరు రైల్వే ఉద్యోగులు మాత్రం మిగిలిన గుర్రాలు కూడా మృత్యువాత పడ్డాయనీ.. వాటిని కూడా ప్రోటోకాల్ ఉద్యోగే మాయం చేసేశారని ఆరోపిస్తున్నారు. దీనిపై విచారణ జరుగుతున్న సమయంలో డీఆర్ఎం సౌరభ్‌కుమార్ ప్రసాద్ సీబీఐకి పట్టుబడి జైలు పాలయ్యారు. దీంతో ఆ ప్రోటోకాల్ ఉద్యోగి గుర్రపు స్వారీ వ్యవహారాన్ని కంచికి చేర్చేసి.. ఫైల్ క్లోజ్ చేయించుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారం బయటకు పొక్కకుండా ఉండేందుకు కొందరు అధికారులకు కూడా సొమ్ములు ముట్టినట్లు డివిజన్‌లో ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం



ఎంవీపీకాలనీలో జాతీయ జెండాతో రిహార్సల్స్ చేస్తున్న విద్యార్థినులు

మహారాణిపేట: రిపబ్లిక్ డే వేడుకలకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలీస్ పరేడ్ మైదానంలో ఆదివారం జరిగే ఈ వేడుకల ఏర్పాట్లను శనివారం జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ పరిశీలించారు. ప్రధాన వేదిక, ఓపెన్ టాప్ అలంకరణ, వీఐపీల సీటింగ్, పౌరులు వేడుకలు తిలకించేందుకు అనుగుణంగా ఏర్పాటు చేసిన గ్యాలరీ ఏర్పాట్లపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతిబింబించేలా ఏర్పాటు చేస్తున్న శకటాల తాజా పరిస్థితిని సమీక్షించిన ఆయన, సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. స్టాళ్లు, వివిధ పరికరాలు, పత్రాల అందజేతకు సంబంధించిన స్టాళ్లను పరిశీలించి, అక్కడ ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రధాన వేదిక వద్ద జరుగుతున్న అలంకరణ పనులు, వీఐపీ, మీడియా, పౌరులు కూర్చునే సీటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, పబ్లిక్ అడ్రస్ సిస్టం, అవార్డుల బహూకరణ తదితర కార్యకలాపాలకు సంబంధించిన ఇన్‌చార్జి అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. కాగా, స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ విశాఖపై జీవీఎంసీ, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంపై విద్యాశాఖ, ఎస్ఎస్ఏ, దీపం–2 పథకంపై సివిల్ సప్లైస్, నా ఆరోగ్యం – నా హక్కు అనే అంశంపై వైద్యారోగ్య శాఖ, పేదరికం లేని సమాజం–మన ప్రభుత్వ ఆశయం అనే అంశంపై డీఆర్డీఏ, మహిళా సాధికారతను తెలియజేస్తూ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, పీఎం సూర్యఘర్ విశిష్టతను తెలియజేస్తూ ఈపీడీసీఎల్, ప్రగతికి 10 సూత్రాల స్వర్ణాంధ్ర సాకారం అనే అంశంపై గృహ నిర్మాణ శాఖ శకటాలను ప్రదర్శించనున్నాయి. వివిధ రకాల ఉత్పత్తులు, కార్యక్రమాలను, సాధించిన ప్రగతిని వివరిస్తూ వ్యవసాయ, పశుసంవర్ధక, హార్టికల్చర్, ఏపీఎంఐపీ, మత్స్యశాఖ, ఐసీడీఎస్, డ్వామా, ఎస్సీ, బీసీ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వనున్నారు.



పోలీస్ పరేడ్ మైదానంలో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు

1,200 కిలోల నిషేధిత ప్లాస్టిక్ పట్టివేత



దుకాణదారుడిని హెచ్చరిస్తున్న అదనపు కమిషనర్ సోమన్నారాయణ

దాబాగార్డెన్స్: నగరంలో ఈ నెల ఒకటో తేదీ ఇప్పటి వరకు 1,200 కిలోల సింగిల్ యూజ్ నిషేధిత ప్లాస్టిక్‌ను తనిఖీ బృందాలు స్వాధీనం చేసుకున్నాయని జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ తెలిపారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి ప్లాస్టిక్ నిషేధం ఉన్నప్పటికీ చాలా చోట్ల నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తున్నట్లు తనిఖీల్లో తేలిందని, అందుకే దాడులు ముమ్మరం చేశామన్నారు. ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగం, లభించే వివరాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. విశాఖను పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని అదనపు కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

జీఆర్పీ డీఎస్పీగా రామచంద్రరావు



తాటిచెట్లపాలెం: విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీస్ డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పి.రామచంద్రరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గవర్నమెంట్ రైల్వే పోలీస్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.ధనుంజయనాయుడు, లైన్ ఇన్‌స్పెక్టర్ ఎ.రవికుమార్, ఎస్ఐలు శాంతారాం, అబ్దుల్ మారూఫ్, రామారావు, కె.టి.ఆర్.లక్ష్మి, బాలాజీరావు, మధుసూదనరావు, షరీఫ్ తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

బదిలీతోనే సరి!



- కైలాసగిరిపై బ్యాటరీ కార్ల నిర్వహణపై ఆరోపణలు
- వేలం లేకుండా ఆపరేటర్లకు అనుమతులు
- అయినప్పటికీ అధికారి బదిలీతోనే సరిపెట్టేశారు..
- కూటమి ప్రజాప్రతినిధుల అండదండలు

విశాఖ సిటీ: కర్ర విరగలేదు.. పాము చావలేదు.. కైలాసగిరిపై బ్యాటరీ కార్ల నిర్వహణ విషయంలో వచ్చిన ఆరోపణలపై వీఎంఆర్‌డీఏ అధికారులు వ్యవహరించిన తీరు అచ్చం అలాగే ఉంది. ఆరోపణలు వాస్తవమని తెలిసినప్పటికీ.. సంబంధిత అధికారిపై నామమాత్రపు చర్యలతో మమ అనిపించేశారు. కైలాసగిరిపై బ్యాటరీ కార్ల నడిపేందుకు నిబంధనలకు విరుద్ధంగా ఇద్దరికి అనుమతులు మంజూరు చేశారు. వాస్తవానికి వీఎంఆర్‌డీఏ పరిధిలో ఏ ప్రాజెక్టు, పనులు చేపట్టాలన్నా టెండర్లు లేదా వేలం నిర్వహించాల్సి ఉంటుంది. కానీ బ్యాటరీ కార్ల విషయంలో మాత్రం వీఎంఆర్‌డీఏ అధికారులు నిబంధనలను తుంగలో తొక్కి కూటమి ప్రజాప్రతినిధుల సిఫార్సులకే పెద్ద పీట వేశారు. నిబంధనలను వ్యతిరేకంగా బ్యాటరీ కార్లను నడిపేందుకు ఇద్దరికి అనుమతులు ఇచ్చేశారు. వీఎంఆర్‌డీఏలో విధులు నిర్వర్తిస్తున్న అధికారే ఒకరు బినామీ పేరుతో సదరు కార్ల నిర్వహణ అనుమతులు పొందినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై 'అధికారులే కాంట్రాక్టర్లు' పేరుతో సాక్షిలో ప్రచురితమైన కథనంతో అధికారులు ఉలిక్కిపడ్డారు.

ఉత్తుత్తి నోటీసులు

నిబంధనలకు విరుద్ధంగా బ్యాటరీ కార్ల నిర్వాహణకు అనుమతులు ఇచ్చేయడంతో పాటు అందులో ప్రయాణికుల నుంచి ఎక్కువగా వసూలు చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. ఒప్పందం ప్రకారం ఒక్కో ప్రయాణికుడి నుంచి రూ.20 వసూలు చేయాల్సి ఉంది. కానీ నిర్వాహకులు రూ.30 వసూలు చేసున్నారు. ఈ విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకురావడంతో హడావుడిగా వీఎంఆర్‌డీఏ అధికారులు తనిఖీలకు వెళ్లారు. అప్పటికే అనుమతులు పొందిన ఒక నిర్వాహకుడు అధిక ధర వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. అలాగే మరో నిర్వాహకుడు అనుమతులు పొందినప్పటికీ బ్యాటరీ కార్లను నడపడం లేదని తెలుసుకున్నారు. దీంతో అధికారులు ఇద్దరికీ ఉత్తుత్తి నోటీసులు జారీ చేసి సరిపెట్టేశారు. అలాగే కార్ల నిర్వహణలో ఆరోపణలు వచ్చిన అధికారిపై మాత్రం నామమాత్రపు చర్యలతో సరిపెట్టేశారు.

ప్రజాప్రతినిధుల అండతో..

ఈ వ్యవహారంలో వీఎంఆర్‌డీఏ అధికారులు దిద్దుబాటు చర్యలు ఉపక్రమించారు. అయితే వీఎంఆర్‌డీఏ ఏవో వెంకటరమణను కేవలం బదిలీ చేసి సరిపెట్టేశారు. అతడిని లీగల్ విభాగంలో నియమించారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇవ్వడంపై మాత్రం ఎవరూ నోరుమెదుపడం లేదు. వాస్తవానికి నిబంధనలకు అతిక్రమించిన వారిపై సస్పెన్షన్ వేటు వేయాల్సి ఉన్నప్పటికీ.. కూటమి ప్రజాప్రతినిధుల అండదండలతో ఒక అధికారిపై బదిలీ వేటు వేసి సరిపెట్టేశారు. ఏవోగా వెంకటేశ్వరరావును నియమించారు.

కలెక్టర్‌కు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు



సీఎస్ విజయానంద్ చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌కు 'బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు–2024'లభించింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చేతులమీదుగా కలెక్టర్ ఈ అవార్డును అందుకున్నారు. అత్యంత పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపకల్పన, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు నిర్వహించిన వినూత్న కార్యక్రమాలు, ఓటర్లను చైతన్యపరచడం తదితర అంశాల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు గానూ ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా కలెక్టర్‌కు జిల్లా అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎన్నికల ప్రక్రియలో పశ్చిమ నియోజకవర్గ ఆర్వోగా వ్యవహరించిన హుస్సేన్ సాహెబ్, భీమిలి ఏఈఆర్వోగా సేవలందించిన పి.హరిదాసు, భీమిలి, పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో బీఎల్‌వోలు కిరణ్మయి, అనురాధ సీఎస్ చేతులమీదుగా అవార్డులు స్వీకరించారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకం

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు





ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జేసీ మయూర్ అశోక్, డీఆర్వో భవానీశంకర్

విశాఖ విద్య: ఓటు ప్రాముఖ్యాన్ని ప్రతీ ఓటరు గుర్తించాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పిలుపునిచ్చారు. ఆంధ్రా యూనివర్సిటీలోని వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియంలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.కిశోర్‌బాబుతో కలిసి జేసీ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ప్రతీ పౌరుడు ఓటర్‌గా నమోదవ్వడంతో పాటు తమ చుట్టు పక్కల వారు కూడా ఓటర్‌గా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఓటు అనే ఆయుధం ద్వారా సుపరిపాలనను అందించే ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశం ఉందని, దీనిని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన అందరితో ప్రతిజ్ఞ చేయించారు. నూతనంగా ఓటు హక్కు కలిగిన యువతీ, యువకులకు ఓటరు కార్డులు అందజేశారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలు కనబరిచిన బీఎల్‌వోలకు, ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకుంటున్న వయోవృద్ధులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు బహూకరించారు. ముందుగా వివిధ కళాశాలల విద్యార్థులు, ఓటర్లు, అధికారులు సీఎంఆర్ సెంట్రల్ నుంచి వై.వి.ఎస్ మూర్తి ఆడిటోరియం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఆర్వో భవానీశంకర్, ఆర్డీవో కె.సంగీత్‌మాధుర్, ఎస్డీసీలు ఎస్.మధుసూదన్ బాబు, జె.సీతారామారావు, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడికి సత్కారం

ఎన్నికల ప్రక్రియలో అత్యధికంగా 16 సార్లు ఓటు హక్కును వినియోగించుకుని అందరికీ స్ఫూర్తిగా నిలిచిన విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ సీఎస్ రాజు(100 సంవత్సరాలు)ను జేసీ మయూర్ అశోక్ సత్కరించారు. ఓటరుగానే కాకుండా ఒక అధికారిగా చురుగ్గా వ్యవహరించి అందరిలో స్ఫూర్తి నింపారని జేసీ కొనియాడారు.



సీఎస్‌రాజును సత్కరిస్తున్న జేసీ అశోక్

రిపబ్లిక్ డే పరేడ్‌కు బుల్లయ్య విద్యార్థులు



న్యూఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొంటున్న ప్రజ్ఞారాణి, యోగిత

సీతంపేట: రిపబ్లిక్ డే సందర్భంగా న్యూఢిల్లీలో ఆదివారం జరగనున్న పరేడ్‌లో బుల్లయ్య కళాశాల ఎన్‌సీసీ ఆర్మీ విభాగానికి చెందిన మాకిరెడ్డి బ్యూలా ప్రజ్ఞారాణి, శివ్వల యోగిత పాల్గొంటున్నట్లు మేజర్ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. అలాగే విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న రిపబ్లిక్ డే వేడుకల్లో కళాశాల ఎన్‌సీసీ ఆర్మీ వింగ్ నుంచి 14 మంది క్యాడెట్లు పరేడ్‌లో పాల్గొంటున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జి.మధుకుమార్, ప్రిన్సిపాళ్లు వీరిని అభినందించారు.

గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ నేడు

విశాఖ సిటీ: విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకున్న విద్యార్థుల కోసం గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్–2025 నిర్వహిస్తున్నట్లు ఐవీవై ఓవర్సీస్ ఎడ్యుకేషన్ సంస్థ హెడ్ రామ్‌కుమార్ బొంగరాల తెలిపారు. నగరంలోని ఒక హోటల్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీచ్‌రోడ్‌లోని నోవాటెల్‌లో ఆదివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఈ ఫెయిర్ జరుగుతుందన్నారు. యూకే, యూఎస్‌ఏ, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జర్మనీ, ఐర్లాండ్, ఫ్రాన్స్ సహా విదేశాలలో ఉన్నత విద్య అవకాశాలపై ఆయా దేశాల విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొని వివరిస్తారని వెల్లడించారు. యూఎస్‌లోని డియాకిన్ యూనివర్సిటీ, లాట్రోబ్ యూనివర్సిటీ, నార్తర్న్ యూనివర్సిటీ, జార్జ్ మేషన్ యూనివర్సిటీ, జాన్ హాప్కిన్స్ యూనివర్సిటీ సహా వందకు పైగా అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన ప్రముఖ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు హాజరవుతున్నట్లు చెప్పారు. ఫెయిర్‌లో పాల్గొనేందుకు ఆసక్తి గల విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, రిజిస్ట్రేషన్లు ఉచితమన్నారు. మరిన్ని వివరాల కోసం 90900 79393లో సంప్రదించాలని సూచించారు.

తియ్యగా మాట్లాడి.. నిలువు దోపిడీ చేసి..

- హనీ ట్రాప్ కేసులో ఏడుగురు అరెస్ట్
- రూ.68,900 సొత్తు స్వాధీనం
- చాకచక్యంగా కేసును ఛేదించిన భీమిలి పోలీసులు
- నిందితులు పాత నేరస్తులే..
- వివరాలు వెల్లడించిన డీసీపీ(క్రైమ్) లతామాధురి

విశాఖ సిటీ: విశాఖలో జరిగిన హనీ ట్రాప్ కేసును భీమిలి పోలీసులు ఛేదించారు. సాంకేతికత సహాయంతో దోపిడీదారులు ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.68,900 సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ(క్రైమ్) కె.లతామాధురి తెలిపారు. శనివారం పోలీస్ సమావేశ మందిరంలో మీడియా సమావేశంలో ఆమె చెప్పిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా పాతపట్నంకు చెందిన ముంజీ రామారావు వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 18వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో అతడికి గుర్తు తెలియని నెంబర్ నుంచి ఫోన్ వచ్చింది. ఆ కాల్‌లో ఒక మహిళ రామారావు వివరాలు అడిగింది. దీనికి ఆయన మీరు ఎవరో తెలియదని చెప్పి ఫోన్ కట్ చేశాడు. 19 తేదీ మధ్యాహ్నం 12 గంటల సమయంలో రామారావు తన కుమార్తెను ఆనందపురం మండలం పెద్దిపాలెం వద్ద చదువుతున్న స్కూల్‌లో దిగబెట్టేందుకు వచ్చాడు. తిరిగి వెళుతున్న సమయంలో మళ్లీ అదే నెంబర్ నుంచి మహిళ ఫోన్ చేసింది. మీరు నాకు బాగా తెలుసని, ఒకసారి కలుద్దామని రామారావుకు చెప్పింది. దీంతో ఆయన సదరు మహిళ ఎవరో తెలుసుకునేందుకు ఆ రోజు సాయంత్రం 4.30 గంటలకు ఆమె చెప్పిన విధంగా అనిట్స్ కాలేజ్ జంక్షన్‌లో వేచి ఉన్నాడు. ఆ సమయంలో రెండు ద్విచక్ర వాహనాలపై ఐదుగురు వ్యక్తులు అతని వద్దకు వచ్చారు. అతడిని బలవంతంగా బైక్‌పై ఎక్కించుకొని విజయనగరం రోడ్డులో ఉన్న రఘు ఇంజినీరింగ్ కాలేజ్ ఎదురుగా ఉన్న నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ రామారావుపై దాడి చేసి పర్సులో ఉన్న రూ.10 వేలు, బ్యాగ్‌లో ఉన్న రూ.40 వేలు లాక్కున్నారు. అలాగే ఫోన్ తీసుకొని ఫోన్ పే పాస్‌వర్డ్ తెలుసుకొని అకౌంట్‌లో ఉన్న రూ.8,900 ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్లిపోయారు. అయితే బాధితుడు ముందు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి భయాందోళనకు గురయ్యాడు. అతని స్నేహితులకు విషయం చెప్పడంతో వారిచ్చిన ధైర్యంతో భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సీసీ ఫుటేజ్ ఆధారంగా..

రామారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన భీమిలి పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. రామారావు వేచి ఉన్న ప్రాంతం నుంచి నిందితులు బైక్‌లపై తీసుకువెళ్లిన మార్గంలో సీసీ కెమెరాల్లో స్పష్టంగా రికార్డయ్యాయి. దాని ప్రకారం పోలీసులు నిందితులను గుర్తించారు. ఈ నెల 24న ఐదుగురిని, 25న మిగిలిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బాధితుడి నుంచి దోచుకున్న నగదుతో పాటు అతని మొబైల్‌ను పోలీసులు రికవరీ చేశారు.



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ(క్రైమ్) లతామాధురి. చిత్రంలో పోలీస్ ఉన్నతాధికారులు

ఐదుగురు పాత నేరస్తులే..

దోపిడీకి పాల్పడిన ఏడుగురిలో ఐదుగురు పాత నేరస్తులే అని పోలీసులు గుర్తించారు. ఏ1 విజయనగరం జిల్లాకు చెందిన బంగారి చక్రధర్(37) మీద నాలుగు కేసులు ఉండగా, ఆ జిల్లాలో టూటౌన్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. ఏ2 విజయనగరం జిల్లాకు చెందిన డోలా లక్ష్మణరావు(26) మీద ఒక కేసు ఉంది. ఏ3 పెదవాల్తేరు ప్రాంతానికి చెందిన బరికి స్వామి(25)పై మూడు కేసులు ఉండగా.. ఇందులో రెండు రేప్ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఏ4 ఎంవీపీ కాలనీకి చెందిన ములపర్తి వెంకటేష్(29)పై ఇదే తొలి కేసు కాగా, ఏ5 వాసుపల్లి శ్యాంప్రకాష్(30) మీద రెండు కేసులతో పాటు ఎంవీపీ స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. అలాగే ఏ6 విజయనగరం జిల్లా కొత్తపేటకు చెందిన ఎంటి సురేష్(30) మీద ఒక కేసు ఉండగా, ఏ7 ప్రధాన నిందితుడి స్నేహితురాలు ఊర్వశీ జంక్షన్‌కు చెందిన కుప్పిలి ఆశారాణి అలియాస్ శ్రావణి(34)పై ఇదే తొలికేసు నమోదైంది. కేసును ఛేదించిన భీమిలి పోలీసులను డీసీపీ(క్రైమ్) లతామాధురి అభినందించారు.

వివాహితను వేధించి రూ.5.60 లక్షలు కాజేశాడు

పోర్టు ఉద్యోగికి రిమాండ్

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు, వలందపేటకు చెందిన ఒక వివాహితను శారీరకంగా వేధించి రూ.5.60 లక్షలు కాజేసిన పోర్టు ఉద్యోగి గొరక జానకీరావును భీమిలి పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గాజువాక జగ్గు సెంటర్‌కు చెందిన నిందితుడు పోర్టులోని ఫైర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. వలందపేటకు చెందిన బాధితురాలు నిందితుడికి దగ్గరి బంధువు. ఆమెకు 15 ఏళ్ల కుమార్తె ఉంది. గత ఏడాది అక్టోబర్ నుంచి జానకీరావు వివాహితకు పదేపదే ఫోన్ చేసి, 'నీ కుమార్తె నగ్న వీడియోలు నా వద్ద ఉన్నాయంటూ' బెదిరించి దఫదఫాలుగా వారి నుంచి రూ.5.60 లక్షలు కాజేశాడు. అయినప్పటికీ వీడియోలు డిలీట్ చేయకుండా వివాహితను మరింత బెదిరించి శారీరకంగా లోబరుచుకున్నాడు. అక్కడితో ఆగకుండా భర్తను వదిలి తనతో వచ్చేయాలని ఆమెపై ఒత్తిడి తీసుకొచ్చాడు. దీంతో సహించలేని బాధితురాలు బంధువుల సహాయంతో శనివారం భీమిలి పోలీసులను ఆశ్రయించింది. సీఐ బి.సుధాకర్ నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, న్యాయస్థానం ఆరు నెలల రిమాండ్ విధించింది.

సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థి ఆకాష్

విశాఖ విద్య: సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో శ్రీకృష్ణాపురం గురుకుల పాఠశాలకు చెందిన పొన్నకాయల ఆకాష్ రూపొందించిన ప్రాజెక్టు ప్రశంసలందుకుంది. ఈ నెల 19 నుంచి 25 వరకు పాండిచ్చేరిలో జరిగిన సైన్స్ ఫెయిర్‌లో ఆరు రాష్ట్రాల నుంచి 210 మంది ప్రాతినిధ్యం వహించగా.. రాష్ట్రం నుంచి ఆకాష్ ప్రదర్శించిన ప్రాజెక్టు మొదటి స్థానం కైవసం చేసుకుంది. ఈ విషయాన్ని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రత్నవల్లి శనివారం తెలిపారు. 'యూజ్ ఆఫ్ మ్యాథ్‌మెటికల్ మోడలింగ్ ఇన్ స్వచ్ఛభారత్' అనే అంశంతో ఆకాష్ ప్రాజెక్టు రూపొందించాడు. విద్యార్థితో పాటు ప్రాజెక్టు రూపకల్పనలో సహకరించిన గణిత ఉపాధ్యాయులను గురుకుల సంస్థ అధికారులు ప్రభావతమ్మ, రూపవతి అభినందించారు.



జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్వస్తిక్ ఆకారంలో నిల్చున్న చంద్రంపాలెం హైస్కూల్ విద్యార్థులు

ఉత్తరాంధ్ర అభివృద్ధికి రూ.50వేల కోట్లు కేటాయించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర జిల్లాల్లో సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి, ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం రూ.50 వేల కోట్లు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శనివారం సీపీఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.లోకనాథం అధ్యక్షతన ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి, ప్రత్యామ్నాయ విధానాలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు నెల్లూరులో సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలు జరగనున్న నేపథ్యంలో విజయవాడ, కర్నూలు, విశాఖలో ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో వనరులు దోచుకునే అభివృద్ధి వద్దని, మానవాభివృద్ధికి సీపీఎం ప్రత్యామ్నాయ విధానంతో పోరాడుతుందన్నారు. ఏపీ అంటే అమరావతి, పోలవరం కాదని, సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు, వికేంద్రీకరణ జరగాల్సి ఉందన్నారు. కూటమి పాలనలో రాష్ట్రం మహా విధ్వంసం జరగబోతుందని స్పష్టం చేశారు. స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 విజన్ పేరిట ఉత్తరాంధ్రలో అటవీ, ఖనిజ, సముద్ర సంపదలు కార్పొరేట్లకు దోచి పెట్టే ప్రణాళిక సిద్ధమైందని విమర్శించారు.



సదస్సులో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

దావోస్ పర్యటనలో బాబు సాధించిందేంటో?

విశాఖ ప్రాంతానికి ఆర్థిక రాజధాని అని చెప్పిన బాబు.. దావోస్ ఐదు రోజుల పర్యటనలో ఒక్క ఐటీ కంపెనీనైనా తెచ్చాడా? అని ప్రశ్నించారు. మహారాష్ట్ర 52, తెలంగాణ 41 ఎంవోయూలు చేసుకున్నాయన్నారు. చంద్రబాబు చెప్పిన పీ–4 విధానంతో సహజ వనరులైన గాలి, వెలుతురు, భూమి, నీరు, రైతుల పొలాలను తీసుకొని సోలార్ విద్యుత్ గ్రీన్ ఎనర్జీ తయారు చేసి ప్రజలనే అమ్మేస్తారని ఆందోళన చెందారు. వ్యవసాయం పునాదిగా పరిశ్రమలు రావాలే తప్ప.. దాన్ని దెబ్బతీసి పరిశ్రమలు అవసరం లేదన్నారు. సదస్సులో రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ (ఇరిగేషన్) ఎస్‌ఈయూ నారాయణరాజు నీటి ప్రాజెక్టులపై వివరించగా, ఉత్తరాంధ్ర అభివృద్ధిపై వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ, ఉత్తరాంధ్ర జిల్లాల సీపీఎం కార్యదర్శులు పాల్గొన్నారు.

'మద్యం షాపుల కేటాయింపులో యాతలకు అన్యాయం'



మాట్లాడుతున్న పిల్లి నూకరాజు

తాటిచెట్లపాలెం: రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు కేటాయించిన మద్యం షాపుల విషయంలో యాతలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఉత్తరాంధ్ర యాత సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షుడు పిల్లి నూకరాజు ఆరోపించారు. నగరంలోని ఆయన నివాసంలో శనివారం మీడియాతో మాట్లాడారు. కల్లుగీత వృత్తిదారుల జీవనోపాధి మెరుగుపరిచేందుకు ప్రభుత్వం మద్యం షాపులు ఏర్పాటు చేయాలని ఆలోచన చేసిందని, కేటాయింపుల అనంతరం ఆ లక్ష్యం నీరుగారిపోయిందన్నారు. 2016లో జరిపిన సర్వే ఆధారంగా కేటాయింపులు చేస్తున్నట్లు జీవోలో పొందుపర్చారని, కానీ ఏ మాత్రం సంబంధం లేని సామాజికవర్గాలకు ఈ షాపులు కేటాయించారన్నారు. గోదావరి జిల్లాల్లో శెట్టిబలిజలకు సరైన పద్ధతిలోనే షాపులను కేటాయించినప్పటికి.. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో మాత్రం ఆ పద్ధతిని అనుసరించలేదన్నారు. అధికశాతం యాత కులస్తులు ఉండే ఈ రెండు జిల్లాల్లో కేవలం ఐదు షాపులు మాత్రమే కేటాయించడం అన్యాయమన్నారు. గీత వృత్తి కులాల జనసాంద్రత ఆధారంగా మద్యం షాపులు కేటాయించాలని డిమాండ్ చేశారు. డిపాజిట్ విషయంలో ప్రభుత్వం పునరాలోచించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

కోవిడ్ బాధిత యువతకు ఆర్థికసాయం

ఎంవీపీకాలనీ: కోవిడ్–19 కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన యువతకు కేంద్ర ప్రభుత్వం ఆర్థికసాయాన్ని మంజూరు చేసినట్లు శిశు, మహిళ సాధికారత శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ జయదేవి తెలిపారు. కోవిడ్ కారణంగా తల్లిదండ్రులు మరణించడంతో ఒంటరిగా మిలిగిలిన 18 ఏళ్లలోపు యువతకు ఈ ఆర్థికసాయం మంజూరైనట్లు తెలిపారు. జిల్లాలో ఈ తరహా బాధిత యువత 398 మంది ఉన్నారన్నారు. ఇలాంటి వారికి నెలకు రూ.4 వేలు చెప్పున అందజేస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో 398 మంది యువతకు 6 నెలలకు గాను నిధులు మంజూరైనట్లు తెలిపారు. మరో రెండు రోజుల్లో నిధులు ఖాతాల్లో జమ అవుతాయన్నారు.

పుష్కరిణి సోయగాలు



సింహాచలం: వరాహ పుష్కరిణి శనివారం ఉదయం కురిసిన పొగమంచుతో నూతన శోభను సంతరించుకుంది. దట్టమైన పొగమంచు పుష్కరిణి పరిసరాలను కప్పివేయడంతో, ఒక అద్భుతమైన దృశ్యం ఆవిష్కృతమైంది. భక్తులు ఈ దృశ్యాన్ని చూసి పరవశులయ్యారు.

–ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

మానసిక దివ్యాంగులకు కొనసాగిన వైద్య పరీక్షలు



పరీక్షల కోసం ప్రభుత్వ మానసిక వైద్యశాలకు వస్తున్న మానసిక దివ్యాంగులు

మహారాణిపేట: మానసిక దివ్యాంగులకు వివిధ కేటగిరీల్లో జారీ చేసిన సదరం సర్టిఫికెట్ల పరిశీలన, వైద్య పరీక్షలు శనివారం కూడా కొనసాగాయి. చినవాల్తేరు ప్రభుత్వ మానసిక వైద్యశాలలో మానసిక దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించారు. మొత్తం వివిధ కేటగిరీల్లో 90 మందికి నోటీసులు జారీ చేశారు. అయితే పలు సాంకేతిక సమస్యల వల్ల 86 మందికి మాత్రమే పరీక్షలు చేసి సదరం సర్టిఫికెట్లను పరిశీలించారు. ఆదివారం సెలవు కావడంతో సోమవారం తిరిగి సర్టిఫికెట్ల పరిశీలన, మానసిక దివ్యాంగులకు వైద్య పరీక్షలు కొనసాగుతాయి.

ఎదుగుదల లేదు



నా కుమారుడు మణికంఠ పుట్టినప్పటి నుంచి మానసిక వైకల్యంతో బాధపడుతున్నాడు. అతనిలో ఎదుగుదల లేదు. వయసు పెరుగుతున్నా ఏమీ అర్థం కావడం లేదు. భోజనంతో సహా అన్ని పనులూ మేమే చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం మణికంఠకు నెలకు రూ.6 వేల పింఛను అందుతోంది. వైద్య పరీక్షలు చేస్తారని చెప్పడంతో ఆస్పత్రికి తీసుకొచ్చాను. మళ్లీ ఎందుకు వైద్య పరీక్షలు చేస్తున్నారో తెలియడం లేదు.

– పి.వరలక్ష్మి, మణికంఠ తల్లి, మద్దిలపాలెం

వారణాసిలో రోడ్డు ప్రమాదం.. బాలుడి మృతి

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



జీవన్(ఫైల్)

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం, శెట్టిబలిజ వీధికి చెందిన రెండు కుటుంబాల సభ్యులు వారణాసి వద్ద జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స పొందుతున్న బాలుడు శనివారం అక్కడ మృతి చెందాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలివీ.. శెట్టిబలిజ వీధికి చెందిన నవీన్, పద్మ, జీవన్ సుయోక్షిత్, సురేష్, సత్య, చందు రెండు కుటుంబాలకు చెందినవారు. వీరు ఈ నెల 17న కారులో కాశీ ప్రయాణం అయ్యారు. 21న అదే కారులో కాశీ నుంచి వారణాసికి వస్తుండగా హైవేపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టినట్లు తెలిసింది. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జు అయింది. ఆ సమయంలో కారులో ఉన్న 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న హైవే పోలీసులు క్షతగాత్రులను అక్కడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ప్రమాదానికి గురైన వారు తెలుగువారు. అక్కడ వైద్యులు, పోలీసులు హిందీ తెలిసిన వారు కావడంతో బాధిత బంధువులకు సమాచారం రావడం ఆలస్యమైంది. ఈ క్రమంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జీవన్ సుయోక్షిత్ (11) శనివారం మృతి చెందాడు. జిల్లా కలెక్టర్‌కు అక్కడ అధికారుల నుంచి ఈ సమాచారం రావడంతో.. ఆయన ములగాడ తహసీల్దార్ భుజంగరావును అప్రమత్తం చేశారు. వెంటనే తహసీల్దార్ బాధిత బంధువులను పరామర్శించారు. గాయపడిన వారిని పరామర్శించేందుకు బంధువులు వారణాసి బయలుదేరారు.

స్వరం కోల్పోయిన రోగికి అరుదైన శస్త్రచికిత్స



చికిత్స పొందిన వ్యక్తితో డాక్టర్ తలే తదితరులు

ఎంవీపీకాలనీ: పోక వక్క గింజ కారణంగా తన స్వరాన్ని కోల్పోయిన రోగికి ఎంవీపీ కాలనీలోని మెడికవర్ ఆసుపత్రి వైద్యులు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. ఇటీవల అతన్ని పరీక్షించిన వైద్యులు ప్రోస్థెసిస్ ట్రాకియల్‌లో గ్రాన్యులేషన్ కణజాలం అడ్డుగా ఉన్నట్లు మొదట గుర్తించారు. వైద్యులు బ్రోంకోస్కోపీ ఫోర్సెప్స్‌ను ఉపయోగించి ఈ కణజాలాన్ని తొలగించడానికి ప్రయత్నించారు. కణజాలం గట్టిగా అతుక్కుపోవడంతో ఆ ప్రయత్నం విఫలమైంది. అనంతరం తగిన జాగ్రత్తలు తీసుకొని ఎలక్ట్రోకాటరీ నైఫ్ ద్వారా శస్త్రచికిత్స చేసి కణజాలాన్ని తొలగించారు. ఆ తర్వాత ప్రోస్థెసిస్‌లో పోక వక్క గింజ ఉన్నట్లు గుర్తించి దాన్ని తొలగించారు. దీంతో చికిత్స విజయవంతమై రోగి తిరిగి తన వాయిస్‌ని పొందినట్లు వైద్యులు తెలిపారు. మెడికవర్ కన్సల్టెంట్ పల్మోనాలజిస్ట్ సుధీర్ తలే నేతృత్వంలోని వైద్య బృందం ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.